సాక్షి పెద్దపల్లి

గురువారం । 30 । నవంబర్ । 2023



ఘనంగా అయ్యప్ప పడిపూజ

ధర్మపురి: అయ్యప్పస్వామి ఆలయం 17వ వార్షికోత్సవం సందర్భంగా ఆరట్టు, పడి పూజ ఘనంగా నిర్వహించారు.



పెరిగిన చలితీవ్రత

పెద్దపల్లిరూరల్ : జిల్లాలో చలితీవ్రత పెరిగింది. ఉదయం 9గంటలు దాటినా చలి తగ్గడంలేదు. ప్రజాజీవనం స్తంభిస్తోంది.

గరిష్టం/కనిష్టం
31.0/26.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. వాతావరణం పొడిగా ఉంటుంది. చలిగాలులు వీచే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రేపు స్పెషల్ క్యాజువల్ లీవ్

పెద్దపల్లిరూరల్: జిల్లాలో ఎన్నికల విధులు నిర్వర్తించిన ప్రభుత్వ ఉద్యోగులకు డిసెంబర్ 1న స్పెషల్ క్యాజువల్ లీవ్ మంజూరు చేస్తున్నామని జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్ ఖాన్ బుధవారం తెలిపారు. ఈనెల 29, 30 తేదీల్లో ఎన్నికల విధుల్లో పాల్గొన్న పాఠశాల, కళాశాల, సాంకేతిక విద్యాశాఖ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పబ్లిక్ సెక్టార్ యూనిట్లలో పనిచేసే వారందరికీ సెలవు వర్తిస్తుందని వివరించారు.

నేడు వేతనంతో కూడిన సెలవు

మంథని: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా గురువారం వేతనంతో కూడిన సెలవు ప్రకటించినట్లు అసిస్టెంట్ లేబర్ అఫీసర్ హేమలత తెలిపారు. వ్యాపార, వాణిజ్య సంస్థల్లో పనిచేసే కార్మికులకు ఇది వర్తిస్తుందన్నారు. యజమానులు నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అన్ని రంగాల్లోని కార్మికులు స్వచ్ఛందంగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని ఆమె కోరారు.

ప్రయాణికుల పాట్లు



ఓదెల(పెద్దపల్లి): భద్రాచలం రోడ్డు నుంచి కాగజ్‌నగర్ మధ్యలో నడిచే సింగరేణి రైలులో ప్రయాణికులకు సరిపడా బోగీలు లేవు. సింగరేణి కార్మికులు, ఉద్యోగుల కోసం ఈ రైలును అందుబాటులోకి తీసుకొచ్చారు. దాదాపు 30 స్టేషన్లలోని ప్రయాణికులను సింగరేణి రైలు గమ్యస్థానాలకు చేర్చుతోంది. అయితే, దీనికి నామమాత్రంగా బోగీలు కేటాయించారు. ప్రయాణికుల రద్దీకి సరిపోక పోవడంతో నరక యాతన అనుభవిస్తున్నారు. ఉన్నవాటిల్లోనూ సీట్ల కొరత వేధిస్తోంది. దక్షిణ మధ్య రైల్వే అధికారులు స్పందించి రైలులో సౌకర్యాలు కల్పించడంతోపాటు బోగీల సంఖ్య పెంచాలని ప్రయాణికులు కోరుతున్నారు.

రూ.4 కోట్ల నగదు సీజ్

పెద్దపల్లిరూరల్: శాసనసభ సాధారణ ఎన్నికల సందర్భంగా జిల్లాలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద చేపట్టిన తనిఖీల్లో రూ.4కోట్ల 90లక్షల వెయ్యి 360 నగదు సీజ్ చేయగా అందులో ఆధారాలు చూపిన రూ.కోటి 23లక్షల72వేల 360 నగదు విడుదల చేసినట్లు ముజమ్మిల్ ఖాన్ బుధవారం తెలిపారు. ఆధారాలు చూపని రూ.3కోట్ల66లక్షల29వేల నగదు సీజ్ చేసి ఉంచామని పేర్కొన్నారు. 1950 టోల్‌ఫ్రీ నంబరు ద్వారా ఇప్పటివరకు 1752 ఫిర్యాదులు అందాయన్నారు. సీ విజిల్‌యాప్ ద్వారా 251 ఫిర్యాదులు అందాయని కలెక్టర్ వివరించారు.

మద్యం స్వాధీనం

ఎలిగేడు(పెద్దపల్లి): అక్రమంగా నిల్వ ఉంచారనే సమాచారంతో సుల్తాన్‌పూర్‌లో బుధవారం ఎఫ్ఎస్టీ బృందాలు తనిఖీలు చేశాయి. ఈసందర్భంగా 240 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నాయి. ఇందులో ఒకరిని అరెస్టు చేసినట్లు ఎఫ్ఎస్టీ పోలీసులు తెలిపారు.

తూర్పున అలర్ట్

మంథని: జిల్లాలోని తూర్పు డివిజన్ నక్సల్స్ ప్రభావిత ప్రాంతంగా పేరుంది. పక్కనే ఉన్న ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర నుంచి నక్సల్ చొరబడే అవకాశం ఉంది. దీంతో పోలీసులు అటవీ గ్రామాలను తమ అధీనంలోకి తీసుకున్నారు. మావోయిస్టుల కదలికలు లేకున్నా పొరుగు రాష్ట్రాల్లో ఉనికి చాటుతున్న నేపథ్యంలో గురువారం జరిగే పోలింగ్‌కు అవాంతరాలు ఎదురు కాకుండా పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. నియోజకవర్గంలో 56 గ్రామాలను సమస్యాత్మక, 64 నక్సల్స్ ప్రభావిత ప్రాంతాలుగా గుర్తించి కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశారు. అయితే, పోలింగ్ ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకే నిర్వహిస్తారు. మిగతా ప్రాంతాల కన్నా ఇక్కడ ఒక గంట ముందుగానే పోలింగ్ ప్రక్రియ గడువు ముగుస్తుంది.

ఓటుకు వేళాయె



ఎన్నికల సామగ్రితో తరలి వెళ్తున్న సిబ్బంది

వజ్రాయుధం.. వినియోగించేది నేడే

- ప్రజలందరూ ఓటు వేయాలి
- ఉమ్మడి జిల్లాలో పోలింగ్‌కు పూర్తయిన ఏర్పాట్లు
- 216 మంది అభ్యర్థులు
- 729 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు



పోలింగ్ కేంద్రాలు, సిబ్బంది వివరాలు

జిల్లా	సమస్యాత్మక కేంద్రాలు	పోలింగ్ సిబ్బంది	పోలీసులు	ఫోన్ నంబర్
కరీంనగర్	289	4,872	5,020	8500666768
జగిత్యాల	248	4,616	3,000	7995084601
పెద్దపల్లి	115	3,352	4,202	7995070700
రాజన్నసిరిసిల్ల	77	3,542	1,650	9849905881
మొత్తం	729	16,382	13,872	--



పెద్దపల్లి కళాశాల మైదానంలో పోలింగ్ సామగ్రి పంపిణీ ప్రక్రియలో పాల్గొన్న ఎన్నికల సిబ్బంది



ఎన్నికల సామగ్రితో వెళ్తున్న సిబ్బంది

సాక్షి ప్రతినిధి, కరీంనగర్:

అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఏర్పాట్లు పూర్తయ్యాయి. ప్రజాస్వామ్యంలో అత్యంత బలమైన పౌరహక్కుల్లో మొదటిస్థానంలో నిలిచేది ఓటుహక్కు. దీన్ని ప్రజలు స్వేచ్ఛగా వినియోగించుకునేందుకు కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల జిల్లాల కలెక్టర్లు, సీపీ/ఎస్పీలు చర్యలు తీసుకుంటున్నారు. సాధారణ ప్రాంతాల్లో ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. మంథని వంటి సమస్యాత్మక ప్రాంతాల్లో సాయంత్రం 4 గంటల వరకే ముగియనుంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 729 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించారు. వీటిలో గరిష్టంగా కరీంనగర్‌లో 289, కనిష్టంగా సిరిసిల్లలో 77 ఉన్నాయి. ఆయా కేంద్రాల్లో ఎలాంటి అలజడులకు తావులేకుండా ముందు జాగ్రత్తగా అదనపు బలగాలను మోహరించారు. నాలుగు జిల్లాల్లో కలిపి, 13,872 మంది పోలీసులకు విధులు కేటాయించారు. ప్రధాన పార్టీలైన బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్, బీఎస్పీలతోపాటు ఏఐఎఫ్‌బీ వంటి చిన్న పార్టీలు, ఇండిపెండెంట్లు కలిపి మొత్తం 216 మంది ఎన్నికల బరిలో ఉన్నారు. వీరందరి రాజకీయ భవితవ్యం తేల్చేందుకు ఓటర్లు గురువారం ఓటేయనున్నారు. ఇందుకోసం అధికారులు 3,417 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. సొంతూరులో ఓటేసేందుకు హైదరాబాద్, ఇతర రాష్ట్రాలు, దేశాల నుంచి కూడా మాతృభూమికి ఓటర్లు తరలి వస్తుండటం విశేషం.



సామగ్రి తనిఖీ చేసుకుంటున్న సిబ్బంది



ఎన్నికల సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు..



జ్యోతినగర్ : పంపిణీ కేంద్రం నుంచి వెళ్తూ..

ఓటర్లు ఇవి పాటించాలి..

- మీ ఓటు ఏ పోలింగ్ కేంద్రంలో ఉందో తెలుసుకునేందుకు ఎలక్షన్ కమిషన్ వెబ్‌సైట్ లేదా సీ–విజిల్ యాప్ వినియోగించుకోవచ్చు.
- ఓటు వేసేందుకు వెళ్లినపుడు పోలింగ్ కేంద్రం దగ్గర పార్టీల గుర్తులు, రంగులు కలిగిన దుస్తులు, టోపీల వంటివి ధరించకూడదు.
- బూత్ లోపలికి సెల్‌ఫోన్లు తీసుకెళ్లకూడదు.
- ఒకవేళ జాబితాలో పేరు ఉండి, ఓటరు కార్డు లేకపోతే ప్రభుత్వం సూచించిన ఆధార్, పాన్ కార్డు, పాస్‌పోర్టు, డ్రైవింగ్ లైసెన్స్, పెన్షన్, బ్యాంక్ ఖాతా పుస్తకం, ఉపాధి హామీ కార్డు తదితర 12 రకాల కార్డుల్లో ఏదో ఒకటి ఎన్నికల అధికారులకు చూపించాలి.
- ఈవీఎం బటన్ నొక్కిన తర్వాత మీరు ఓటేసిన గుర్తు అక్కడి తెరపై ఏడు సెకన్లపాటు కనిపిస్తుంది. అలా మీ ఓటుని నిర్ధారించుకోవచ్చు.
- ఓటు వేయడంలో ఏవైనా ఇబ్బందులున్నా, మీ ఓటు మరొకరు వేసినా.. వెంటనే పోలింగ్ ఆఫీసర్‌కు ఫిర్యాదు చేయొచ్చు.
- ఒకసారి పోలింగ్ కేంద్రంలోకి వెళ్లాక ఓటు వేసేందుకు ఎంత సమయమైనా అధికారులు మీ ఓటు తప్పకుండా తీసుకుంటారు.

గత పోలింగ్ శాతం దాటేనా?

2018 ఎన్నికల్లో గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువ పోలింగ్ జరిగింది. కరీంనగర్‌లో 69.29, చొప్పదండిలో 79.73, మానకొండూరులో 85.36, హుజూరాబాద్‌లో 84.40, హుస్నాబాద్‌లో 83.97, కోరుట్లలో 75.84, జగిత్యాలలో 78.83, ధర్మపురిలో 80.19, రామగుండంలో 71.94, మంథనిలో 85.41, పెద్దపల్లిలో 84.08, వేములవాడలో 80.62, సిరిసిల్లలో 80.88 శాతం పోలింగ్ నమోదైంది. ఆయా నియోజకవర్గాలను పరిశీలిస్తే ఇది కరీంనగర్‌లో అత్యల్పం, మంథనిలో అత్యధికంగా ఉంది. కరోనా మహమ్మారి తర్వాత స్మార్ట్ మొబైల్ ఫోన్లు, డేటా వినియోగం విపరీతంగా పెరిగింది. దీంతో ప్రభుత్వం ఎన్నికలు, ఓటుహక్కు వినియోగంపై చేసిన విస్తృత ప్రచారం కారణంగా గతంతో పోలిస్తే ఈసారి పోలింగ్ శాతం పెరుగుతుందని అధికారులు ధీమాగా ఉన్నారు.

పోలింగ్ కేంద్రాలు..

కరీంనగర్‌లో 390, చొప్పదండిలో 327, మానకొండూరులో 316, హుజూరాబాద్‌లో 305, రామగుండంలో 259, మంథనిలో 288, పెద్దపల్లిలో 290, వేములవాడలో 170, సిరిసిల్లలో 287, కోరుట్లలో 262, జగిత్యాలలో 254, ధర్మపురిలో 269 మొత్తం 3,417 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు.



చంటిపాపలతో ఎన్నికల విధులకు..



ఈవీఎంలు అప్పగిస్తున్న అధికారులు



పోలీసు భద్రతతో పోలింగ్ కేంద్రాలకు వెళ్తూ..

ప్రశాంత వాతావరణంలో పోలింగ్

- జిల్లాలో పకడ్బందీ ఏర్పాట్లు
- ఎన్నికల అధికారి ముజమ్మిల్‌ఖాన్

గోదావరిఖని: జిల్లాలో అసెంబ్లీ పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయని జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. బుధవారం రామగుండం రిటర్నింగ్ కార్యాలయాన్ని సాధారణ ఎన్నికల పరిశీలకుడు రాజేశ్‌సింగ్ రాణాతో కలిసి పరిశీలించారు. రిజర్వ్ ఈవీఎంలు, రిజర్వు పోలింగ్ సామగ్రి సెక్టార్ అధికారుల వద్ద భద్రంగా ఉండాలని, సెక్టార్ అధికారులు, పోలింగ్ సిబ్బంది ఎన్నికల నిబంధనలను పాటించాలని సూచించారు. జిల్లాలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో మొత్తం 838 పోలింగ్ కేంద్రాల్లో 7లక్షలకు పైగా ఓటర్లు ప్రశాంత వాతావరణంలో తమ ఓటుహక్కు వినియోగించుకునేందుకు అవసరమైన అన్నిఏర్పాట్లు పూర్తి చేశామని అన్నారు. ప్రతీ పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లకు అవసరమైన వసతులు కల్పించామని, దివ్యాంగుల కోసం ర్యాంప్‌లు, ట్రై సైకిళ్లు ఏర్పాటు చేశామన్నారు. ఓటు మన భవిష్యత్‌ను నిర్దేశిస్తుందని, ప్రలోభాలకు లోనుకాకుండా ప్రజలు ఆలోచించి, స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని ఆయన కోరారు.



ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎన్నికల అధికారి ముజమ్మిల్‌ఖాన్

ఆయన వెంట ఎన్నికల రిటర్నింగ్ అధికారి జె.అరుణశ్రీ, ఎన్నికల అధికారులు తదితరులు ఉన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి

పెద్దపల్లిరూరల్: పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు అన్ని సౌకర్యాలు కల్పించామని జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. స్థానిక రిక్రియేషన్‌క్లబ్‌లో దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఓటరు జాబితాలో పేరు నమోదై ఉన్నవారంతా ఓటు హక్కును వినియోగించుకోవాలని పేర్కొన్నారు.

సౌకర్యాల కల్పన పూర్తి..

రామగిరి(మంథని): ప్రశాంత వాతావరణంలో పోలింగ్ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తిచేశామని జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. సెంటినరీకాలనీ జేఎన్టీయూలోని ఎన్నికల సామగ్రి, సిబ్బంది డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను ఆయన పరిశీలించి అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. రామగుండం, పెద్దపల్లి, మంథని రిటర్నింగ్ అధికారులు అరుణశ్రీ, మధుమోహన్, హనుమా నాయక్, రవీందర్, ప్రవీణ్ పాల్గొన్నారు.

ఎన్నికలకు పటిష్ట బందోబస్తు



భద్రతా చర్యలు పరిశీలిస్తున్న రామగుండం సీపీ రెమా రాజేశ్వరి

- సమస్యాత్మక ప్రాంతాల్లో కేంద్ర బలగాల నిఘా
- 3,052 సివిల్, 16 కంపెనీల కేంద్ర బలగాలు.
- 1,150 ఇతర రాష్ట్రాల సిబ్బంది సేవల వినియోగం
- రామగుండం సీపీ రెమా రాజేశ్వరి

గోదావరిఖని: కమిషనరేట్ పరిధిలో గురువారం నిర్వహించే అసెంబ్లీ పోలింగ్ ప్రశాంత వాతావరణంలో ముగిసేలా పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి తెలిపారు. బుధవారం పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లోని ఎన్నికల రిటర్నింగ్ కార్యాలయాలను ఆమె సందర్శించారు. పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాలో ఉన్న ఆరు డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల నుంచి సెక్టార్ అధికారులు, పోలీసు రూట్ మొబైల్ అధికారులు, ఆర్మ్‌డ్ అధికారులతో పోలింగ్ అధికారులను, పోలింగ్ పరికరాలను పోలింగ్ లొకేషన్‌లకు తీసుకు వెళ్తున్నామని పేర్కొన్నారు. పెద్దపల్లి జిల్లాలో 1,291 మంది అధికారులు, సిబ్బంది, ఆరు కంపెనీల కేంద్ర బలగాలు, 500 మంది మధ్యప్రదేశ్‌కు చెందిన హోంగార్డులు, మంచిర్యాల జిల్లాలో 1,762 మంది అధికారులు, సిబ్బంది, 10 కంపెనీల కేంద్ర బలగాల, 650 మంది ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన హోంగార్డులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి వచ్చిన ఒక పోలీస్ టీమ్ సేవలు వినయోగించనున్నామని వెల్లడించారు. మానిటరింగ్ కోసం 24/7 కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. లాడ్జీలు, ఫంక్షన్‌హాళ్లు, గెస్ట్‌హౌస్‌లు, చెక్‌చేసి ఇతర ప్రాంతాల వారిని బయటకు పంపించనున్నట్లు వెల్లడించారు. మంచిర్యాల జిల్లాలో1,989 మంది, పెద్దపల్లి జిల్లాలో 2,231మందిని బైండోవర్ చేశామని పేర్కొన్నారు.

ప్రభావిత ప్రాంతాల్లో ప్రత్యేక బలగాలు

మావోయిస్టు ప్రభావిత ప్రాంత పోలింగ్ లోకేషన్లలో ప్రత్యేక భద్రత ఏర్పాట్లు చేశామని సీపీ తెలిపారు. సరిహద్దు రాష్ట్రాల ప్రాణహిత పరీవాహక ప్రాంతాల్లో డ్రోన్ పెట్రోలింగ్ యూనిట్ ఏర్పాటు చేసి ప్రత్యేకంగా నిరంతర నిఘా ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి, నియమ, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని రెమా రాజేశ్వరి హెచ్చరించారు. ఎన్నికల ప్రక్రియకు భంగం కలిగించినా అల్లర్లు గొడవలకు పాల్పడే ఎంతటి వారైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని పేర్కొన్నారు.

సమస్యాత్మక ప్రాంతాలపై నజర్..

రామగుండం పోలీసు మిషనరేట్ పరిధిలోని సమస్యాత్మక ప్రాంతాలను అధికారులు గుర్తించారు. పెద్దపల్లి జిల్లాలో 403 లొకేషన్లలో 754పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 64లొకేషన్లలో 125పోలింగ్ కేంద్రాలు సమస్యాత్మకంగా ఉన్నట్లుగా గుర్తించారు. మంచిర్యాల జిల్లాలో 494లొకేషన్లలో 801కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 82లొకేషన్లలో 167పోలింగ్ కేంద్రాలు సమస్యాత్మకంగా ఉన్నట్లు గుర్తించారు. 50లొకేషన్లలో 53 పోలింగ్ కేంద్రాల్లో మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలు ఉన్నట్లుగా నిర్ధారించారు. ఈమేరకు సమస్యాత్మకం, మావోయిస్టు ప్రాంతాల్లో భారీ పోలీసుబందోబస్తు, డ్రోన్ల ద్వారా నిఘా ఏర్పాటు చేశారు.

144 సెక్షన్ అమలు

రామగిరి(మంథని): రామగుండం పోలీసు కమిషనరేట్ పరిధిలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని, అంతటా 144 సెక్షన్ అమలు చేస్తున్నామని సీపీ రెమా రాజేశ్వరి తెలిపారు. జేఎన్టీయూలోని డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని ఆమె పరిశీలించార. అధికారులకు పలు సూచనలు చేశారు.

సింగరేణి గుర్తింపు ఎన్నికలకు సమాయత్తం

- 4న యూనియన్లు, యాజమాన్యంతో సమావేశం
- ఇప్పటికే పూర్తయిన నామినేషన్ల ప్రక్రియ
- 27న పోలింగ్ నిర్వహణకు ఏర్పాట్లు

గోదావరిఖని: అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు పూర్తయిన వెంటనే సింగరేణి బొగ్గు గనుల్లో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల నగారా మోగనుంది. సింగరేణిలో ఎన్నికల ప్రక్రియ ప్రారంభించేందుకు చీఫ్ లేబర్ కమిషనర్ డి.శ్రీనివాసులు రంగంలోకి దిగారు. సంస్థవ్యాప్తంగా ఉన్న 11ఏరియాల్లో 39,600మంది ఉద్యోగులు పనిచేస్తుండగా, సీక్రెట్ బ్యాలెట్ పద్ధతిన ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించారు. హైకోర్టు ఆదేశాల మేరకు వచ్చేనెల(డిసెంబరు) 27న గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు నిర్వహించాలనే లక్ష్యంతో డిప్యూటీ సీఎల్‌సీ ప్రణాళిక సిద్ధం చేశారు. ఈమేరకు డిసెంబరు 4వ తేదీన సీఎల్‌సీ కార్యాలయంలో హాజరు కావాలని సింగరేణి సంస్థలోని 13కార్మిక సంఘాలు, సింగరేణి యాజమాన్యానికి ఆయన లేఖ రాశారు. సింగరేణిలో ప్రస్తుతం ఉన్న ఓటరు జాబితా, ఎన్నికల విధివిధానాలు ఖరారు చేయనున్నారు. గతంలో ఉన్న పద్ధతి ప్రకారం గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల లెక్కన ఎన్నికలు నిర్వహిస్తారా? లేక ఈసారి మార్చుతారా? అనే విషయం తేలాల్సి ఉంది. రెండు ఓట్ల పద్ధతిన గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలను కార్మికులు సీక్రెట్ బ్యాలెట్ పద్ధతిన ఎన్నుకుంటారు. ఇప్పటివరకు అసెంబ్లీ వేడితో కార్మిక క్షేత్రం బిజీగా మారగా, గుర్తింపు ఎన్నికల పక్రియ ప్రారంభం కావడంతో డిసెంబర్ నెలాఖరువరకు ఇదే వేడి కొనసాగుతుందని భావిస్తున్నారు.



ఇప్పటికే పూర్తయిన నామినేషన్ల ప్రక్రియ

సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల కోసం ఇప్పటికే అన్ని యూనియన్ల నామినేషన్లు పూర్తయ్యాయి. నామినేషన్ల పరిశీలన అనంతరం గుర్తుల కేటాయింపు కూడా పూర్తయ్యింది. సంస్థలోని 13 కార్మిక సంఘాలు తమ నామినేషన్లు వేయగా, అధికారులు వాటికి గుర్తులను కేటాయించారు.

ఓటరు జబితా అందిస్తాం

డిసెంబరు 27న కార్మిక సంఘం ఎన్నికలకు సిద్ధంగా ఉన్నాం. దీనికోసం డిసెంబర్–4 సమావేశం ఏర్పాటు చేశాం. దీనికి అన్నికార్మిక సంఘాలు, యాజమాన్యం హాజరుకావాల్సి ఉంది. ఈసమావేశంలో ఓటరు జాబితా అందజేసి అభ్యంతరాల కోసం నాలుగు రోజుల గడువు ఇస్తాం. ఎన్నికల గైడ్‌లైన్స్, పోలింగ్ బూత్‌లు తదితర విషయాలను చర్చిస్తాం. ఓటరు జాబితాపై అభ్యంతరాలు పూర్తయిన తర్వాత తుది జాబితా ప్రకటిస్తాం.

– శ్రీనివాసులు, డిప్యూటీ సీఎల్‌సీ

అభివృద్ధి జాడ లేదు.. పర్యాటకం కానరాదు

- జాడ లేని ప్రగతి పరుగులు
- చారిత్రక ఆనవాళ్లు ఉన్నా పట్టింపు కరువు
- ఆధ్యాత్మికంపైనా తీవ్ర నిర్లక్ష్యం
- రామగుండంపై అధికార యంత్రాంగం అశ్రద్ధ

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్


రామగుండం: సహజ వనరులకు కొదవ లేదు.. శ్రామిక శక్తికి ఏలోటూ లేదు.. స్థలం కొరత అంత కన్నా లేదు.. నిధుల విడుదలలో ఏమాత్రం జాప్యం కావడంలేదు.. ఉన్నదంతా నిలువెల్లా అధికార యంత్రాంగం నిర్లక్ష్యమే.. అందుకే రామగుండం పారిశ్రామిక ప్రాంతం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది.

తొలి థర్మల్ విద్యుత్ రామగుండంలోనే..

- ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే తొలి థర్మల్ విద్యుత్ కేంద్రం రామగుండంలోనే నిర్మించారు. అంటే రామగుండం పారిశ్రామి ప్రాంతం ప్రాధాన్యత ఎంతఉందో అర్థం చేసుకోవచ్చు.
- ఎన్టీపీసీ, బీ–థర్మల్, రైల్వేస్టేషన్, సింగరేణి బొగ్గు గనులు, ఎరువుల తయారీ కంపెనీ, సిమెంట్ కంపెనీ తదితర పరిశ్రమలు రామగుండం పేరిట స్థాపించారు.
- రాముడు సీతను నడియాడిన నేల కూడా ఇక్కడే ఉంది.
- రాముడు–సీతాదేవి సంచరించిన ఆనవాళ్లు ఇంకా చెక్కు చెదరకుండా ఉన్నాయని చరిత్రకారులు చెబుతున్నారు.
- ఇందుకు నిదర్శనంగా భక్తులు ఆయా ప్రాంతాలను దర్శించుకొని పునీతులవుతున్నారు.

పర్యాటకంపై దృష్టి సారిస్తే..

పట్టణ సమీపంలోని రామునిగుండాల ఆధ్మాత్మికంగా, పర్యాటకంగా ఎంతో అభివృద్ధి చెందే అవకాశం ఉంది. రామలక్ష్మణుడు, సీతాదేవి ఇక్కడ సంచరించినట్లు ఆనవాళ్లు ఉన్నాయి. ఈ కొండపై 108 గుండాలు ఉండగా ఇందులో ఒకగుండం 200 అడుగుల లోతు, 50 అడుగుల వెడల్పుతో ఓలోయ ఉంది. రాముడు ఈ ప్రాంతంలో పర్యటించినప్పుడు పాద ముద్రల స్థానంలో ఏర్పడిన గుంతలు గుండాలుగా మారి రామగుండంగా పేరు వచ్చిందని చరిత్రకారులు చెబుతున్నారు. 108 గుండాల్లో అన్నికాలాల్లోనూ నీరు సమృద్ధిగా లభిస్తూ ఉండడం ఇక్కడి విశేషం. ఇందులో ప్రధానమైనవి పాలగుండం, నేతిగుండం, జీడిగుండం, పసుపుగుండం, తొక్కుడుగుండం, యమగుండం, ధర్మగుండం, మోక్షగుండం ఉన్నాయి.



రామునిగుండాలు



కనువిందు చేస్తున్న జలపాతం

కొండపై లోయ.. సొరంగం..

- రామునిగుండాల కొండపై లోయ మధ్యలో సొరంగ మార్గం ఉంది. దీనిని యమకోణమని పేర్కొంటారు.
- ఈ సొరంగం గుండా నిత్యం నీరు పారుతూ ఉంటుంది.
- ప్రతీ శ్రావణ, కార్తీకమాసంలో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి శ్రీసీతారామ లక్ష్మణులను దర్శించుకుంటారు.
- ఇంతటి ప్రాధాన్యం కలిగిన రామునిగుండాలను పర్యాటక కేంద్రంగా మార్చేందుకు ఎవరూ ఆసక్తి చూపడంలేదు.
- కొత్త జిల్లాల ఆవిర్భావం సందర్భంగా రామగుండం ప్రాధాన్యం గుర్తించి దీని పేరిటనే జిల్లా కేంద్రం ఏర్పాటు చేస్తారని భావించినా జాబితాలో ఆ పేరు లేకపోవడంతో ప్రజలు అసంతృప్తికి లోనయ్యారు.

అభివృద్ధికి ఆమడదూరం



రామునిగుండాలను అభివృద్ధి చేసేందుకు అటవీ భూముల సాకుతో అభివృద్ధికి నోచుకోకపోవడం లేదు. ఆధ్యాత్మిక చరిత్ర కలిగిన ప్రాంతాలను వివక్ష లేకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అభివృద్ధి చేయాలి. ఆధ్యాత్మికంగా, పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు అర్హత ఉన్నా పాలకుల ఆధిపత్య ధోరణితో అభివృద్ధికి దూరంగా ఉంది.

– భట్టు ప్రసాద్, పట్టణవాసి

అవకాశం ఉన్నా..



రామగుండం పేరిట ఉన్న ప్రతీ పరిశ్రమకు సామాజిక బాధ్యత పథకం (సీఎస్ఆర్) కింద నిధులు విడుదల చేసి అభివృద్ధి పరిచే అవకాశం ఉంది. కానీ తమ స్వార్థ రాజకీయాల కోసం ఇక్కడి పరిశ్రమల నుంచి వచ్చే సీఎస్ఆర్ నిధులను పాలకులు వేరే ప్రాంతాలకు తరలించుకెళ్లారు. ఏ ప్రాంతమైనా ఆధ్యాత్మిక, పర్యాటకంగా అభివృద్ధి చేస్తే అన్ని రంగాలు ప్రగతి సాధిస్తాయి.

– ముస్త్యాల శంకర్‌లింగం, పట్టణవాసి

మూలనపడ్డ ప్రణాళిక..

రామునిగుండాలను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు అప్పటి మున్సిపల్ పాలకవర్గం నిర్ణయం తీసుకుంది. ఈక్రమంలో 2007లో అప్పటి మున్సిపల్ చైర్మన్ రామునిగుండాలను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు ఇస్కాన్ సంస్థను సంప్రదించారు. రూ.200 కోట్ల అంచనా వ్యయంతో హైదరాబాద్‌లోని బిర్లా మందిర్ తరహాలో దేవాలయం, కొండకింద నుంచి పైకి రోప్‌వే నిర్మాణం తదితర పనులు చేపట్టేందుకు ప్రణాళిక రూపొందించారు. ఇస్కాన్ ప్రతినిధులు కూడా క్షేత్రసందర్శనకు రాగా అటవీశాఖ అధికారుల అభ్యంతరంతో అభివృద్ధికి ఆటంకాలు ఎదురయ్యాయి. భూ వివాదాస్పద అంశాలతో ఇస్కాన్ సంస్థ ముందుకు రాలేదు.

క్లుప్తంగా

పోలింగ్ విధులను కట్టుదిట్టంగా నిర్వహించాలి

- జిల్లా అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్



రామగిరి: ఎన్నికల పోలింగ్ విధులను సిబ్బంది కట్టుదిట్టంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ సూచించారు. బుధవారం స్థానిక జేఎన్టీయూ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను పెద్దపల్లి, మంథని సాధారణ ఎన్నికల పరిశీలకులు శ్రీధరతో కలిసి పరిశీలించారు. నవంబర్ 30న మంథని నియోజకవర్గంలో ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. పోలింగ్ సజావుగా సాగేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామని అన్నారు. సిబ్బందికి పోలింగ్ నిర్వహణకు అవసరమైన బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్, ఇతర పోలింగ్ సామగ్రిని అప్పగించామన్నారు. రిజర్వ్ పోలింగ్ సామగ్రి సెక్టార్ అధికారుల వద్ద అందుబాటులో ఉందని అన్నారు. పెద్దపల్లి, మంథని రిటర్నింగ్ అధికారులు మధుమోహన్, హనుమానాయక్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

గుండెపోటుతో మున్సిపల్ సీనియర్ కాంట్రాక్టర్ మృతి



నారాయణగౌడ్ (ఫైల్)

జ్యోతినగర్: గుండెపోటుతో మున్సిపల్ సీనియర్ కాంట్రాక్టర్ గడ్డం(సుందిల్ల) నారాయణగౌడ్(59) బుధవారం మృతిచెందాడు. ఎన్టీపీసీ రామగుండం అన్నపూర్ణకాలనీలో నివసిస్తున్న రామగుండం మున్సిపల్ సీనియర్ కాంట్రాక్టర్ నారాయణగౌడ్ ఉదయం అస్వస్థతకు గురి కాగా.. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చేర్పించారు. వైద్యులు చికిత్స అందించే లోపు మృతిచెందాడు. మృతుడికి భార్య విజయతో పాటు ఇద్దరు కుమార్తెలున్నారు. పలువురు కాంట్రాక్టర్లు, గౌడ సంఘం నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

ఒకేచోట మూడు పోలింగ్ కేంద్రాలు

- ఐదు గ్రామాల ఓటర్లకు అడ్డంకిగా మధ్యలో కుందనపల్లి రైల్వే గేటు
- నిమిషం తీరిక లేకుండా ఇరువైపులా రైళ్ల రాకపోకలు
- ఒక్కోసారి రైలు వెళ్లేందుకు అరగంటకు మించి సమయం



కుందనపల్లి పోలింగ్ కేంద్రం

రామగుండం: ప్రతీ ఏటా పలు గ్రామాల ఓటర్లకు ఓటు హక్కు వినియోగించుకోవడంలో తిప్పలు తప్పడం లేదు. అంతర్గాం మండల పరిధిలోని కుందనపల్లి గ్రామానికి అనుబంధంగా ఐదు గ్రామాలుండగా.. మూడు గ్రామాల మధ్య ప్రధాన రైల్వే గేటు(ఐదు రైల్వే లైన్లు) ఉంది. ఫలితంగా బ్రద్రిపల్లి, కుందనపల్లి ఇందిరమ్మ కాలనీ, మొగల్‌పహాడ్, రాజీవ్ స్వగృహకాలనీలకు చెందిన ఓటర్లు రైల్వే గేటు మీదుగా కుందనపల్లి గ్రామ పంచాయతీ, ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రానికి చేరుకొని తమ ఓటు హక్కును వినియోగించుకోవాల్సి వస్తోంది. కుందనపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో రెండు పోలింగ్ కేంద్రాలు 236, 237, గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఒక పోలింగ్ కేంద్రం 238 ఏర్పాటు చేశారు. ప్రభుత్వ అధికారిక కార్యాలయాలు, ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేయడం సహజమే. రైల్వే గేటు దాటకుండా బ్రద్రిపల్లి, ఇందిరమ్మకాలనీ, రాజీవ్ స్వగృహ, మొగల్‌పహాడ్ గ్రామాల ప్రజలు ఓటు హక్కును వినియోగించుకునేందుకు మొగల్‌పహాడ్ గ్రామంలో విశాలమైన తరగతి గదులతో కూడిన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల పోలింగ్ కేంద్రానికి అనువుగా ఉంటుంది. సదరు గ్రామాలకు కేటాయిస్తే ఓటర్లు రైల్వే లైన్ల మీదుగా రాకపోకలు సాగించకుండా సకాలంలో ఓటు హక్కును వినియోగించుకునే అవకాశముంటుంది.

నిమిషానికో రైలు

కుందనపల్లి రైల్వే గేటు మీదుగా ప్రతి నిమిషానికి ఒక రైలు ఇరువైపులా రాకపోకలు సాగిస్తుంటుంది. ఇందులో మూడు ప్రధాన రైల్వే లైన్లు కాగా.. అదనంగా ఒక లైను గోదావరిఖని బొగ్గు గనులకు, మరొకటి ఇంధన నిల్వల డిపోలకు ఉంటుంది. ఫలితంగా ఐదు రైల్వే లైన్లలో ఏదో ఒక రైలు రాకపోకలు నిత్యం జరుగుతూనే ఉంటాయి. ఇందులో అదనంగా ఉన్న రెండు రైల్వే లైన్ల మీదుగా వెళ్లే రైళ్లు చాలా ఆలస్యంగా, నెమ్మదిగా వెళ్లాల్సి రావడంతో.. అరగంట సమయం గేటు వద్ద వేచి ఉండాల్సిన దుస్థితి నెలకొంది.

కుందనపల్లి గ్రామ ఓటర్లు 2,536

- ప్రభుత్వ పాఠశాలలోని 236 పోలింగ్ కేంద్రంలో 911 మంది ఓటర్లు
- ప్రభుత్వ పాఠశాలలోని 237 పోలింగ్ కేంద్రంలో 843 మంది ఓటర్లు
- గ్రామ పంచాయతీ కార్యాలయం 238 పోలింగ్ కేంద్రంలో 782 మంది ఓటర్లు

రెండు కిలోమీటర్లు వెళ్లాలి



బ్రద్రిపల్లి గ్రామం నుంచి కుందనపల్లి గ్రామ పంచాయతీకి రావాలంటే సుమారు రెండు కిలోమీటర్లు. ఈ గ్రామానికి ఆటోలు రావు. కేవలం వ్యక్తిగత వాహనాల ద్వారా పోలింగ్ కేంద్రానికి చేరుకోవాల్సి ఉంటుంది. మధ్యలో రైల్వే గేటు వేసి ఉంటే గంట పాటు ఆలస్యమే. మొగల్‌పహాడ్‌లోని ప్రభుత్వ పాఠశాలలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేస్తే ఓటర్లకు ఇబ్బందులుండవు.

– పచ్చునూరి సాయికుమార్, బ్రద్రిపల్లి ఓటరు

ఆసక్తి చూపని ఓటర్లు



ఓటేసేందుకు ద్విచక్ర వాహనంపై వెళ్లే రైల్వే గేటు దాటాల్సి ఉంటుంది. రైల్వే గేటు వేసి ఉంటే గంట సమయం వృథా అయినట్టే. అసౌకర్యంగా ఉండడంతో కొంతమంది ఓటేసేందుకు కూడా ఆసక్తి చూపించడం లేదు.

– చింతల శంకర్, ఇందిరమ్మకాలనీ, కుందనపల్లి

మొగల్‌పహాడ్ పాఠశాల అనుకూలం



తమ గ్రామంలో విశాలమైన తరగతి గదులు, క్రీడామైదానంతో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేస్తే రైల్వే ట్రాక్‌కు ఒకవైపున్న గ్రామాల ఓటర్లకు అనుకూలంగా ఉంటుంది. ఓటేసే క్రమంలో రైల్వే గేటు దాటకుండా ప్రమాదరహితంగా, ప్రశాంతంగా ఓటు హక్కును వినియోగించుకోవాలంటే ఎన్నికల సంఘం పునరాలోచించి రాబోయే ఎంపీ, సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికలకు మొగల్‌పహాడ్‌లో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలి.

– దొంగల మహేందర్‌యాదవ్, మొగల్‌పహాడ్ ఓటరు

గందరగోళంగా పోస్టల్ బ్యాలెట్ వినియోగం



అధికారితో ఉపాధ్యాయుల వాగ్వాదం

పెద్దపల్లిరూరల్: పోస్టల్ బ్యాలెట్ వినియోగం ఈసారి ఎన్నికల్లో కొంత గందరగోళానికి దారి తీసింది. పోస్టల్ ఓటు కోసం దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయులు తమకు ఓటేసే అవకాశం ఎందుకు ఇవ్వడం లేదంటూ ఎన్నికల అధికారులతో వాగ్వాదానికి దిగారు. పెద్దపల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్‌లో తమ పేర్లు ఎందుకు లేవని, తాము చేసుకున్న దరఖాస్తులు ఏమయ్యాయో చెప్పాలంటూ ధర్మారం మండలానికి చెందిన కొందరు ఉపాధ్యాయులు ఎన్నికల అధికారులతో వాదనకు దిగారు. పోలీసులు జోక్యం చేసుకుని శాంతింపజేశారు. అయితే ఉపాధ్యాయుల సొంత గ్రామం ఓ నియోజకవర్గం.. పని చేసే ప్రాంతం మరోచోట.. ఎన్నికల విధులు నిర్వహించేది మరోటి కావడం వల్లే ఎన్నికల అధికారుల సమన్వయ లోపంతోనే ఇలా జరిగిందని ఓ అధికారి పేర్కొన్నారు. అయితే వీలైనంత మేర మళ్లీ ఉపాధ్యాయుల నుంచి ఫారం12డీ తీసుకొని ఓటు హక్కును కల్పించేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. పెద్దపల్లి నియోజకవర్గంలోని కేంద్రంలో 1,117 మంది పోస్టల్ బ్యాలెట్ ఓట్లను వినియోగించుకున్నట్లు అధికారులు వివరించారు.

గడువు పెంచాలని డిమాండ్

ఎన్నికల విధులు నిర్వర్తించే ఉద్యోగ, ఉపాధ్యాయులు ఓటు హక్కు వినియోగించుకునేందుకు గడువు పెంచాలని ఉపాధ్యాయ సంఘ నాయకులు అశోక్‌రెడ్డి, రాంకిషన్‌రావు, లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ఎన్నికల అధికారుల అనాలోచిత నిర్ణయాలతో ఈ పరిస్థితి తలెత్తిందని ఆరోపించారు. పోస్టల్ బ్యాలెట్ కోసం 15రోజుల క్రితమే దరఖాస్తు చేసుకున్నా.. ఓటు హక్కు వినియోగించుకోకుండా ఎందుకు చేశారన్నది అర్థం కావడం లేదన్నారు. అధికారులు ఉద్యోగ, ఉపాధ్యాయులకు డిసెంబర్ 2 దాకా ఓటు వేసే అవకాశాన్ని ఇవ్వాలన్నారు.

నకిలీ ఓటర్లకు 'చాలెంజ్'

సాక్షి, పెద్దపల్లి: చాలెంజ్ ఓటు అనేది ఓటు వేయడానికి కాదు.. అక్రమ ఓట్లను అడ్డుకోవడానికి ఉపయోగిస్తారు. ఎవరైనా ఓటు వేయడానికి వచ్చినప్పుడు, పోలింగ్ ఏజెంట్.. అతడు నకిలీ ఓటరు అని గుర్తిస్తే ఆ విషయాన్ని ప్రిసైడింగ్ అధికారి దృష్టికి తీసుకెళ్తారు. దానికి ఏజెంట్ తగిన రుసుం చెల్లించాల్సి ఉంటుంది. అప్పుడు పీవో ఓటు వేయడానికి వచ్చిన వ్యక్తి గుర్తింపుకార్డులు, ఓటరు జాబితాలో పేరు, వయసు తదితర వివరాలు సరిచూస్తారు. అవిసరిగా ఉంటే ఓటుహక్కు కల్పిస్తారు. లేకపోతే ఎన్నికల ఏజెంట్ చెప్పినది నిజమని స్పష్టమైతే ఓటు వేయకుండా ఆ వ్యక్తిని అడ్డుకుని, చట్టంప్రకారం చర్యలు తీసుకుంటారు.

టెండర్ ఓటు..

ఓటు వేయడానికి పోలింగ్ కేంద్రానికి వెళ్లాక మన ఓటు వేరేవారు వేసినట్లయితే.. అప్పుడు మనం టెండర్ ఓటు వేయవచ్చు. ముందుగా సదరు విషయాన్ని పీవోకు ఫిర్యాదు చేయాలి. అప్పుడు పీవో.. ఏజెంట్ల సమక్షంలో పరిశీలించి నిజమైతే ఓటు వేయడానికి అవకాశం కల్పిస్తారు. సదరు ఓటును ఈవీఎంలో కాకుండా పోస్టల్ బ్యాలెట్ ద్వారా వేయాల్సి ఉంటుంది. దాన్ని పీవో నమోదు చేసుకుంటారు. సదరు ఎన్నికల్లో అభ్యర్థులకు సమానంగా ఓట్లు వచ్చినప్పుడు ఆ ఓటును లెక్కిస్తారు.

సెల్ఫీలు నిషేధం..

ఓటుహక్కు వినియోగించుకునే సమయంలో మొబైల్ ద్వారా సెల్ఫీలు తీసుకోవడం లేదా ఇతరులకు చూపించడం నిషేధం. ఒకవేళ అలా చేస్తే 49ఎం(ఓటు రహస్యం) నిబంధన మేరకు ఆ ఓటరును బయటకు పంపిస్తారు. ఆ ఓటును నిబంధన 17ఎ లో నమోదు చేస్తారు. లెక్కింపు సమయంలో ఆ ఓటును పరిగణనలోకి తీసుకోరు.

కరెక్టు వేశామో లేదో చూడవచ్చు

ఎన్నికల సంఘం ఈవీఎంలపై అనుమానాలు నివృత్తి చేసేందుకు, మనం వేసిన ఓటు ఏ అభ్యర్థికి వేశామో తెలుసుకునేందుకు అవకాశం కల్పించింది. ఇందులో భాగంగా 2014సార్వత్రిక ఎన్నికల్లో వీవీప్యాట్ (ఓటర్ వెరిఫయబుల్ అడిట్ ట్రయల్)ను ప్రవేశపెట్టింది. దీంతో ఓటు వేశాక ఏడు సెకన్ల పాటు మనం ఓటు వేసిన అభ్యర్థి క్రమసంఖ్య, పేరు, గుర్తు ఉన్న పేపర్‌ను మనకు తెర పై చూపెడుతుంది. తర్వాత దానంతట అదే వీవీప్యాట్ బ్యాక్స్‌లో పడిపోతుంది. తెర్పై కనిపించే గుర్తు సరిపోనిపక్షంలో పీఓకు ఫిర్యాదు చేయవచ్చు.

వీటిలో ఏదైనా ఒకటి ఉంటే ఓటు వేయవచ్చు

ఓటు వేయాలంటే ప్రభుత్వం గుర్తించిన ఏదైనా గుర్తింపు కార్డు తప్పనిసరి. ఓటరు స్లిప్పు కేవలం వివరాల కోసమే. భారత ప్రభుత్వం మంజూరు చేసిన 13రకాల గుర్తింపు కార్డులను చూపి మన ఓటుహక్కు వినియోగించుకోవచ్చు.

- ఓటరు గుర్తింపు(ఎపిక్)కార్డు
- ఆధార్ కార్డు
- ఉపాధిహామీ పథకం జాబ్‌కార్డు
- ఫొటోతో కూడిన బ్యాంకు, పోస్టాఫీసు పాసుబుక్
- కార్మికశాఖ ఇచ్చిన ఆరోగ్యబీమా స్మార్ట్‌కార్డు
- డ్రైవింగ్ లైసెన్స్, పాన్‌కార్డు
- ఎన్‌పీఆర్ ద్వారా ఆర్‌జీఐ జారీచేసిన స్మార్ట్‌కార్డు
- పాస్‌పోర్టు
- ఫొటోతో కూడిన పింఛన్ డాక్యుమెంట్
- ఉద్యోగులకు ప్రభుత్వం జారీచేసిన పీఎస్‌యూలు,
- ప్రభుత్వ రంగ సంస్థలు జారీచేసిన ఫొటోతోకూడిన గుర్తింపుకార్డు
- ప్రత్యేక వైకల్యం ఐడీ కార్డు

పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది

గోదావరిఖని: రామగుండం రిటర్నింగ్ కార్యాలయం నుంచి పోలింగ్ సిబ్బంది ఆయా గ్రామాలు, పోలింగ్ బూత్‌లకు బయలుదేరారు. గురువారం నిర్వహించే ఎన్నికల కోసం ఈవీఎంలు, ఇతర సామగ్రితో పయనమయ్యారు. రామగుండం నియోజకవర్గంలో 116 లొకేషన్లలో 260 పోలింగ్ బూత్‌లున్నాయి. పోలింగ్ కోసం సుమారు 1500మంది సిబ్బంది, వెయ్యి పోలీసులను వినియోగిస్తున్నారు. నియోజకవర్గంలో 2,21లక్షల మంది ఓటర్లుండగా, ఈసారి 80శాతానికి పైగా ఓటింగ్ లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు. గతంలో 71శాతం పోలింగ్ జరిగింది. ఈసారి 15వేలకు పైగా కొత్త ఓటర్లున్నారని అధికారులు వెల్లడించారు. ఓటేసేందుకు వచ్చే ఓటర్లు ఓటర్ స్లిప్‌తో పాటు ఏదైనా గుర్తింపు కార్డు వెంట తీసుకురావాలని కోరారు. నియోజకవర్గ ఓట్ల లెక్కింపు మంథని జేఎన్‌టీయూలో ఉంటుందన్నారు.




రిటర్నింగ్ కార్యాలయం టెంట్ల కింద సామగ్రితో పోలింగ్ సిబ్బంది

11గని కార్మికుల మెరుపు సమ్మె

- పాత రోడ్డు మూసివేతపై ఆగ్రహం
- సింగరేణి తీరుతోనే కార్మికుడు మృతిచెందాడని ఆరోపణ
- గనిలో లాకౌట్ ప్రకటించిన సింగరేణి యాజమాన్యం



గనిపై ఆందోళన నిర్వహిస్తున్న కార్మికులు



THE SINGARENI COLLIERIES COMPANY LTD.,
(A GOVT. COMPANY)

NOTICE

యాజమాన్యం గనిపై అంటించిన లాకౌట్ నోటీసు

గోదావరిఖని: పాత రోడ్డును మూసేసి ప్రాణాల మీదకు తెస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డుప్రమాదంలో సింగరేణి కార్మికుడి మృతిని నిరసిస్తూ బుధవారం జీడీకే–11గనిపై విధులు బహిష్కరించి ఆందోళన నిర్వహించారు. గనికి వెళ్లేందుకు నిత్యం పది కిలోమీటర్లు అదనంగా ప్రయాణించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఫైవింక్లయిన్, సుందిళ్ల, ముస్త్యాల మీదుగా కొత్త రోడ్డు వెంట కార్మికులు ప్రయాణించడంతో నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నారని పేర్కొన్నారు. పాత రోడ్డు రెండు ఓసీపీల మధ్యలో ఉందని, బ్లాస్టింగ్ చేస్తే రాళ్లు మీదపడి ప్రమాదాల బారిన పడుతున్నారనే ఆలోచనతో యాజమాన్యం మూసివేసింది. గత కొన్ని నెలలుగా కొత్త రోడ్డువెంట వాహనాల రద్దీ ఎక్కువగా ఉండటంతో ప్రమాదాలకు గురవుతున్నారని అన్నారు. పాత దారి వెంట కార్మికులు డ్యూటీకి వెళ్లే అవకాశం ఉన్నా యాజమాన్యం కావాలనే మూసివేసి ఇబ్బందులకు గురిచేస్తోందని కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డు మార్చేంతవరకు తాము విధులకు హాజరుకాబోమని స్పష్టం చేశారు. అధికారులు వచ్చి తమకు సమాధానం చెప్పేంతవరకు శవాన్ని తీయనీయబోమని ఏరియా ఆస్పత్రి వద్ద కాసేపు ధర్నా నిర్వహించారు.

విధులను బహిష్కరించిన కార్మికులు

జీడీకే–11గనికి వెళ్లేదారిని మార్చాలని కోరుతూ బుధవారం కార్మికులు విధులు బహిష్కరించి గనిపై ధర్నా నిర్వహించారు. యాజమాన్యం నిర్లక్ష్యంతోనే సింగరేణి కార్మికుడు కట్కం సంపత్ మంగళవారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొని మృతి చెందాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రమాదాలకు నిలయంగా మారిన 14కిలోమీటర్ల దారిని వెంటనే మార్చి నాలుగు కిలోమీటర్లున్న దారిని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. సింగరేణి యాజమాన్యం ఈవిషయంపై ముందుకు రాకపోవడంతో విధులు బహిష్కరించి గని ప్రధాన గేట్ ఎదుట ధర్నా చేశారు. ఆందోళన చేస్తున్న కార్మికులకు కార్మిక సంఘాలు సంఘీభావం ప్రకటించాయి. యాజమాన్యం కావాలనే మొండిగా వ్యవహరిస్తోందని నాయకులు యాదగిరి సత్తయ్య, తుమ్మల రాజారెడ్డి, కెంగెర్ల మల్లయ్య, వాసిరెడ్డి సీతారామయ్య, నర్సింహారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

లాకౌట్ ప్రకటించిన యాజమాన్యం

కార్మికులు మెరుపు సమ్మెకు దిగడంతో యాజమాన్యం జీడీకే–11గనిలో లాకౌట్ ప్రకటించింది. మొదటి షిఫ్టు కార్మికులు విధులు బహిష్కరించి ధర్నా నిర్వహించగా, రెండో షిఫ్టు కార్మికులు కూడా విధులకు హాజరుకాలేదు.

మనసు ఊరుకో'లేఖ'

సిరిసిల్ల: కాలం కరిగిపోతోంది.. మరో అయిదేళ్లు మనల్ని పాలించే ప్రతినిధులను ఎన్నుకునే రోజు రానే వచ్చింది. నేడు(గురువారం–నవంబర్ 30) ఓట్ల పండుగ. ఈ ఒక్కరోజు ఓటరుగా మీరు రాజు. నిస్వార్థ ప్రజాసేవకుడిని ఎన్నుకోండి. మా గుర్తుకు ఓటేయండి అంటూ ఎన్నికల్లో పోటీ చేసేవారంతా మైకు.. ఎల్ఈడీ స్క్రీన్లు పెట్టి మరీ చెప్పారు. చేసిన అభివృద్ధి.. చేస్తామన్న పనులు వివరించారు. ఓటర్ల చుట్టూ చేరి, చేతులు జోడించి ఓటు అడిగారు. కాళ్లు మొక్కుతామన్నారు. మీరు గెలిపించకపోతే ప్రాణాలు తీసుకుంటామన్నారు. అయిదేళ్లకోసారి వచ్చే అరుదైన అవకాశం ఇదే.. లే.. లే.. నిర్లక్ష్యాన్ని వీడు. పోలింగ్ స్టేషన్ వైపు నడువు. ఓటనే వజ్రాయుధాన్ని సంధించు. నీ ఓటు మంచి పాలనకు బాట కావాలి. స్వార్థపరులకు వేటవ్వాలి. వంగి వంగి దండాలు పెట్టిన నేతలంతా మట్టి కరవాలి. ఎన్నికల వేళ నీ ఓటు ఎంత అమూల్యమైందో గుర్తించు. మన తలరాతలను మార్చే మంచి లీడర్‌కు ఓటెయ్యి. ఎన్నికల రోజు కావడంతో నా మనసు ఊరుకోలేక ఇదంతా చెబుతున్నా.. ఇంతకూ నేనెవరో మీకు చెప్పనేలేదు కదా.. మిమ్మల్ని కన్న మీ పల్లె తల్లిని. మీ క్షేమం.. నా అభివృద్ధిని కాంక్షిస్తూ ఓ మంచి మాట చెబుదామని మీ ముందుకొచ్చిన. ఒక్కసారి నా మొర ఆలకించండి.

- అరచేతిలో వైకుంఠం చూపించే మాటల గారడీ నేతలను నమ్మకండి. మనీకో, మద్యం సీసాకో విలువైన మీ ఓటు అమ్మకండి. అందుకే చెబుతున్నా... తస్మాత్ జాగ్రత్త. ఏవేవో ఇస్తామని ఆశలు పెడుతున్రు. కులం, ప్రాంతం, ప్రగతి పాఠాలను బోధిస్తూ మీ ముందుకొచ్చిన నాయకుల అసలు రూపం గమనించండి. లోతుపాతుల్ని.. ఆ మాటల వెనక ఉన్న నయవంచన గుర్తించండి. మీ ఓటుతో ఎందరో గద్దెనెక్కి రాజ్యమేలారు. మీకు, మీ అందరికీ నీడనిచ్చిన నాకు జరిగింది ఏమిటి? ఒక్కసారి మనసు పెట్టి, ఆలోచించండి. ఎన్నికల్లో ఎన్నెన్నో హామీలిచ్చి గెలిచాక ఒక్కసారైనా మీ ముఖం చూడని వారిని గెలిపించాల్నా? మన నియోజకవర్గ సమస్యల్ని, మన బాధలను పట్టించుకోకుండా కాంట్రాక్టులు చేసి, సంపాదించుకునేవారు.. కమీషన్లు దండుకునే వారిని గెలిపించుకోవాల్నా? ఏదైనా పని పడి నేతల మద్దతుకు పోతే ఇంటి గేటవుతల నిలబెట్టే లీడర్లను గెలిపించాల్నా? తెలుసుకోండి. దండం పెట్టాడని ఓటేస్తే.. మళ్లీ అయిదేళ్ల వరకు కనిపించరు. గతంలో రాజ్యమేలిన నేతలు ఏం చేశారో ఆలోచించండి. అధికారంలో ఉన్నప్పుడు ఏం చేయనోడు.. రేపు చేస్తానంటే నమ్మేదెలా? ఏ పార్టీ వాడన్నది ముఖ్యం కాదు.. ఏపాటివాడో చూడండి. వ్యవసాయం పండుగలా సాగాలి.. చదువుకున్న వారికి ఉద్యోగాలు రావాలి.. ఉన్న ఊర్లో ఉపాధి దొరకాలి.. గల్ఫ్ దేశాలకు బతకపోయే వారి బాధలు పోవాలి. నల్లసూరీళ్ల బతుకుల్లో వెలుగులు నిండాలి. అన్ని కులాలు, మతాలకు భరోసా కావాలి. ఆత్మగౌరవంతో బతికేలా ఉండాలి. మీ, నా సంక్షేమాన్ని చూసుకునే మంచి నేతలు అందలమెక్కాలి. లే..లే.. చలికాలమని లేవడానికి ఇబ్బంది పడకు.. పోలింగ్ కేంద్రానికి వెళ్లకుండా.. ఓటు వేయకుండా ఉండొద్దు. నీతిమంతులకు పట్టం కడితే నువ్వు, నేను బాగుపడతాం. మీ అంతరాత్మ సాక్షిగా ఓటేయండి. నమస్తే.. ఇక ఉంటాను.

– మీ అందరి క్షేమం కోరే మీ ఊరు